మైత్రి కమిటీ సభ్యులు మరింత క్రియాశీలకంగా పని చేయాలి


గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: మైత్రి కమిటీ సభ్యులు మరింత క్రియాశీలకంగా పని చేయాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. మంగళవారం పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులతో కలిసి ఆయన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు మైత్రి కమిటీ సభ్యులు ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. కొంత కాలం నుంచి ప్రార్థనా స్థలాలు, ఆలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు చేసుకోవాలని నిర్వాహకులను కోరుతున్నామన్నారు. ఇంకా ఎన్నో ప్రార్థనా స్థలాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు కాలేదని ఆయన అన్నారు. సీసీ కెమెరాలు ఉంటే నేరస్తులను వెంటనే పట్టుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పీస్ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. రాజు వస్తాద్, ఏ.పరమానందం, నర్సింహ, ఆబేద్, ఆజామ్‌ఖాన్ తదితరులున్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

నాంపల్లి: డిసెంబరు 1న పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ చైర్మన్ మన్నె శ్రీధర్ రావు నేతృత్వంలో మంగళవారం ఆయన నివాస గృహంలో మాలల సింహ గర్జన వాల్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఇది మాలల ఆత్మగౌరవ సభగా అభివర్ణించారు. ఈ సభను విజయవంతం చేయడానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు ఎంపీ సెగ్మెంట్లు, 24 ఎమ్మెల్యే నియోజకవర్గాలు, 150 డివిజన్లలో నివసించే మాలలు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పి.బలవంతరావు, వైస్ చైర్మన్లు తాలూకా రాజేష్, గోకుల కల్యాణ్ క్షత్రి ప్రవీణ్, ఆదర్శ మౌర్య, మహిళా వైస్ చైర్మన్ సుధమల్ల అంజలి తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి.రజిని అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బాలల దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..విద్యార్థులందరూ కుల, మత, ప్రాంతీయత్వ, సంకోచిత భావాలు లేకుండా విశాల దృక్పథంతో ఎదగాలని సూచించారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ బాలలత మాట్లాడుతూ.. విద్యార్థులంతా రాజ్యాంగ విలువలను చిన్నతనం నుంచే నేర్చుకొని మంచి పౌరులుగా ఎదగాలని తెలియజేశారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల ప్రతినిధులు నరిశెట్టి సుందర్‌రాజు, ఎస్.సరిత, కొండవీటి జయ ప్రసాద్ పాల్గొన్నారు.

రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలి

గౌలిపురా: 20 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్ఎంలను ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలని వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు మాట్లాడుతూ..20 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్ఎంలకు రెగ్యులరైజేషన్, కనీస వేతనాలు, ఇతర చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలన్నారు. రాత పరీక్ష లేకుండా క్రమబద్ధీకరణ కోసం జరిగిన పోరాటాలు, సమ్మె ఫలితంగా ప్రభుత్వం ఉన్నతాధికారులతో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. కమిటీ ఎలాంటి చర్చలు, నివేదిక ఇవ్వకుండా మళ్లీ అదే నోటిఫికేషన్‌పై రాత పరీక్షకు ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. ప్రస్తుతం రాత పరీక్షను నిలిపివేసి త్రిసభ్య కమిటీ ద్వారా చర్చలు జరిపి రాత పరీక్ష లేకుండా వీరి సేవలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యాదనాయక్, రాజశేఖర్, మధురిమ, కవిత, సత్యరాణి, అరుణ, మమతా, జ్యోతి, విజయ, కిరణ్మయి తదితరులు ఉన్నారు.


ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు


చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టీజీఎస్పీడీసీఎల్ సీబీడీ ఏడీఈలు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. రామ్నాస్ పురా విద్యుత్ ఫీడర్ పరిధిలోని రామ్నాస్ పురా, ఐటీఐ కాలనీ, సారో బ్యాక్ సైడ్, మోచి కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడిఈ తెలిపారు. అలాగే ప్రిన్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జూ పార్క్ మెయిన్ రోడ్, రామ్నాస్ పుర, ప్రిన్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. ఫలక్‌నుమా విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. తీగలకుంట విద్యుత్ ఫీడర్ పరిధిలోని అచ్చిరెడ్డి నగర్, తీగలకుంట, బీబీకా చష్మా తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు.

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో..

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ విజయనగర్ కాలనీ ఫీడర్ పరిధిలోని విజయనగర్ కాలనీ బస్టాప్, విజయనగర్ కాలనీ ఫుడ్ వరల్డ్, లక్కీ కిరాణ అండ్ జనరల్ స్టోర్, పాల బూత్ పాత అండ్ కొత్త ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

చోరీలకు పాల్పడిన ఇద్దరి అరెస్టు

అబిడ్స్: పని చేస్తున్న సంస్థలోనే చోరీకి పాల్పడిన ఓ వ్యక్తితో పాటు అతని స్నేహితుడిని మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. జిన్సీ చౌరాహీకు చెందిన శ్రవణ్‌కుమార్‌కు ఆర్కేపేట సమీపంలోని శివ మందిర్ వద్ద కియారా కిచెన్ హార్డ్‌వేర్ గోడౌన్ ఉంది. అందులో రాజస్థాన్‌కు చెందిన తన బావమరిది ఆకాష్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆకాష్‌కుమార్ అతని స్నేహితుడైన గుజరాత్‌కు చెందిన పియూష్‌తో కలిసి గత ఏప్రిల్ నెల నుంచి గోడౌన్‌లోని కిచెన్ హార్డ్‌వేర్ వస్తువులను తక్కువ ధరకు మార్కెట్‌లో విక్రయించడం ప్రారంభించారు. అనుమానం వచ్చిన యజమాని శ్రవణ్‌కుమార్ ఈనెల 13న మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఆగాపురా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. గోడౌన్ నుంచి దొంగిలించిన రూ.17.50 లక్షల విలువ చేసే కిచెన్ హార్డ్‌వేర్ వస్తువుల్లో కొన్ని వస్తువులను మార్కెట్‌లో విక్రయించగా వచ్చిన రూ.5.20 లక్షల నగదులో రూ.20 వేలు ఖర్చు చేయగా మిగిలిన రూ.5 లక్షల నగదును నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి పాల్పడిన సొత్తు, నగదుతో కలిపి మొత్తం రూ.17.30 లక్షల విలువ చేసే హార్డ్‌వేర్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్, డీఐ పి.మహేందర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్, డీఐ మహేందర్


గోల్కొండ బీజేఆర్ బాలికల కళాశాలలో..


అవార్డు గ్రహీతలతో జస్టిస్ నంద తదితరులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషిని పలువురు స్మరించుకున్నారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలపై ప్రతిజ్ఞలు చేశారు. పలుచోట్ల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో రాజ్యాంగ దినోత్సవం ప్రాముఖ్యతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


కవి సమ్మేళనంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆచార్యులు


వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు సురేష్ ముదిరాజ్ తదితరులు


వేడుకల్లో మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్, డి.గోపాల్‌జీ


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్


ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఆళ్ల రామకృష్ణ తదితరులు



నేషనల్ హై స్కూల్‌లో..


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పులిగారి గోవర్ధన్ రెడ్డి


ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి అధికారులు, ఉద్యోగులు


మాట్లాడుతున్న నిమ్మ నారాయణ

చార్మినార్ మండల ఇన్‌చార్జి డిప్యూటీ ఈఓగా సుజాత

యాకుత్‌పురా: విద్యాశాఖ చార్మినార్ మండల ఇన్‌చార్జి డిప్యూటీ ఈఓగా సుజాతను నియమిస్తూ ఆర్‌జేడీ విజయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డిప్యూటీ ఈఓగా విధులు నిర్వహిస్తున్న నెహ్రూబాబును సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సుజాతను నియమించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన నెహ్రూబాబుపై సస్పెన్షన్ వేటు పడినట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా చార్మినార్ మండల-2 డిప్యూటీ ఐఓఎస్‌గా సుల్తాన్ షాహి పాఠశాలలో జీహెచ్ఎం గ్రేడ్-2 హోదాలో డిప్యూటీ ఐఓఎస్ విధులు నిర్వహిస్తున్న వెంటక నరసరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

అయ్యప్ప అన్నప్రసాదం పంపిణీ ప్రారంభం



అబిడ్స్: శంకర హర హర అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద పంపిణీ మంగళవారం ప్రారంభించారు. గోడేకబార్ భారత్ కమ్యూనిటీ హాల్‌లో అయ్యప్ప స్వాముల కోసం ప్రతిరోజూ ఉచిత అన్నప్రసాద పంపిణీ చేపట్టారు. మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్, సేవా సంఘం నాయకులు ముందుగా అయ్యప్ప పూజ నిర్వహించి అన్నప్రసాదం ప్రారంభించారు. ముఖేష్ సింగ్ మాట్లాడుతూ..అయ్యప్ప భక్తులకు కేరళ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు చేయాలని డిమాండ్ చేశారు.

గంజాయి, డ్రగ్స్ పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: గోల్కొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో ఎస్‌ఓటీ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ముగ్గురు నిందితుల నుంచి రూ.1,84,500 లక్షల విలువైన గంజాయి, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2.7 కిలోల గంజాయి, 11 గ్రాముల ఎండీఎంఏ, 3 ఎల్ఎస్‌డీ బ్లాట్స్ లభించాయి. వీటి విలువ రూ.1,84,500 ఉంటుందని అంచనా. దాడుల్లో ఒక కారు, స్కూటీని కూడా స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.6లక్షలు ఉంటుంది. గంజాయి డ్రగ్స్ అమ్మకాలకు పాల్పడుతున్న పి.సాయిబాబు, వై. వెంకటరెడ్డి, వి. సోనియా ఎలిషా అలియాస్ ప్రియాంకను అరెస్టు చేసి గోల్కొండ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే కౌసర్


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు తప్పకుండా అందుతాయని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన హకీంపేట్‌లో గోల్కొండ, ఆసిఫ్‌నగర్ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో అత్యధికులు నిరుపేదలే అని అన్నారు. గత పదేళ్లల్లో తాను ఎమ్మెల్యేగా ఉంటూ నియోజకవర్గ పరిధిలోని వేలాది మంది నిరుపేదలకు వివిధ రకాల సంక్షేమ పథకాలు మంజూరు చేయించానన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్, మజీద్‌ఖాన్ తదితరులున్నారు.


ఉద్యోగులకు అండగా భారతీయ మజ్దూర్ సంఘ్


సమావేశంలో మజ్దూర్ సంఘ్ నాయకులు

అబిడ్స్: ఉద్యోగులకు అండగా భారతీయ మజ్దూర్ సంఘ్ ఎల్లప్పుడు ఉంటుందని హైదరాబాద్ జిల్లా అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు టి.కృష్ణ పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, ప్రగతి, అభివృద్ధి కోసం తాము ముందుంటామన్నారు. మంగళవారం భారతీయ మజ్దూర్ సంఘ్ హైదరాబాద్ జిల్లా అడ్‌హాక్ కమిటీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రామిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రామ్మోహన్ ఆధ్వర్యంలో ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన టి.కృష్ణ మాట్లాడుతూ..హైదరాబాద్ జిల్లాలోని జీహెచ్ఎంసీతో పాటు అన్ని శాఖల ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం అందుబాటులో ఉండి నిరంతరం వారి శ్రేయస్సుకు పాటుపడతామన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా టి.కృష్ణ, ఉపాధ్యక్షులుగా సంపత్, పవన్, ప్రకాష్, మహేష్, కార్యదర్శిగా టీకారం, జాయింట్ సెక్రెటరీగా రావుల కొల్లు వెంకటేష్, రాజేష్, జీఎన్.దాస్, యాదగిరి, ఆర్గనైజింగ్ సెక్రెటరిగా దుర్గాచారి, ట్రెజరర్‌గా జగదీశ్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ..నూతన కమిటీని నియమించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆనంద హోమ్స్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. వెలుగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు క్రీడల్లోనూ చురుగ్గా ఉండేలా తల్లిదండ్రులు చూడాలని సూచించారు. మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ ముప్పాల వేణు మాట్లాడుతూ..వివిధ విభాగాల్లో క్రీడా పోటలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. 9 ఏళ్ల వయస్సు ఉన్న క్రీడాకారిణి శాన్వి లట్టాల తనకంటే పెద్ద వయస్సు వాళ్లతో ఆడి విజయాలను సాధించడంపై ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెలుగూరి రాంకుమార్, అంతర్జాతీయ క్రీడాకారుడు బీవీఎస్‌కే లింగేశ్వర్, సీనియర్ కోచ్ దామెర ప్రకాష్, మురళీ, సిద్దు తదితరులు పాల్గొన్నారు.


వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులతో పలువురు ప్రతినిధులు

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ డివిజన్‌లోని రవీంద్రనాయక్ నగర్‌లో రూ.9 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం బీజేపీ ఎస్టీ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు వి.గోపి నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రవీంద్రనాయక్ నగర్‌లో నెలకొన్న సమస్యలతో ప్రజలు నిత్యం అవస్థలకు గురవుతున్నారు. రోడ్డు సమస్యను విన్నవించిన వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.రాకేష్ నాయక్, బి.ప్రమేలీ బాయి, బుజ్జి బాయి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేసే వారికే పదవులు

గోల్కొండ: పార్టీ కోసం పని చేసే వారికే పదవులు వరిస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గుడిమల్కాపూర్ వెజిటెబుల్ మార్కెట్ చైర్మన్ పదవిని స్థానికులకే ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీని అంటిపెట్టుకున్న వారు పదవులకు అర్హులన్నారు. అటువంటి వారికి పార్టీ ప్రాధాన్యమిస్తుందన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి సంబంధిత అధికారులు, నాయకులతో చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటామని ఆయన అన్నారు. ఆయనను కలిసిన వారిలో ముంగి రఘుపాల్ రెడ్డి, రాజు తదితరులున్నారు.


మహేష్‌కుమార్‌గౌడ్‌తో మాట్లాడుతున్న కురాకుల కృష్ణ

రేడియోగ్రాఫర్ పారా మెడికల్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి



సుల్తాన్‌బజార్: రెండు దశాబ్దాలుగా కేవలం 35 రేడియోగ్రాఫర్ పోస్టులు మాత్రమే భర్తీ చేయడం జరిగిందని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ.రఫీయుద్దీన్ అన్నారు. మంగళవారం మెడికల్ హెల్త్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రెటరీకి పారా మెడికల్ రేడియోగ్రాఫర్ ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వాలని వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న అన్ని పారా మెడికల్ రేడియోగ్రాఫర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారా మెడికల్ రేడియోగ్రాఫర్స్ కృష్ణ, యాదగిరి, రాములు, వెంకటేష్, రమేష్, శంకర్, నిసార్, జీవన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవా రత్న అవార్డు అందుకున్న రుద్రారం అంజయ్య



చార్మినార్: ఉప్పుగూడకి చెందిన రుద్రారం అంజయ్య ముదిరాజ్ సేవా రత్న అవార్డు–2024 అందుకున్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బంగారపు దయానంద్, కౌన్సిల్ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, కే. గోపాల్ సింగ్, జస్టిస్ పిఎస్ నారాయణ, డిఎల్ పాండు సమక్షంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాశమోని శ్యామ్ రావు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మనీవైజ్ ఫైనాన్షియల్ లిట్రసీ ఫర్ ఫ్యూచర్ లీడర్‌పై అవగాహన

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ, మహిళా భద్రత క్లబ్ అభయ, ఫిక్కీ వైఎఫ్ఎల్‌ఓ హైదరాబాద్ వారు సంయుక్తంగా మనీ వైజ్ ఫైనాన్షియల్ లిట్రసీ ఫర్ ఫ్యూచర్ లీడర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వైఎఫ్ఎల్‌ఓ చైర్‌పర్సన్ రితిజైయిన్ మాట్లాడుతూ.. నేటి యువతరం ఆర్థికంగా, స్వాతంత్రంగా మారేందుకు సరైన మార్గనిర్దేశనం ఎంతో అవసరం అన్నారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ మనుశర్మ మాట్లాడుతూ.. ఆర్థిక, స్వాతంత్రతను సాధించడం ఎలా అనే అంశంపై విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ బాలో ముంద్రా, మహిళా భద్రత క్లబ్ కో ఆర్డినేటర్ అపర్ణ తనం, పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.